

రక్తహీనత నివారణకు చర్యలు: డీఎంహెచ్‌వో

గుమ్మలక్ష్మీపురం: జిల్లాలో రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో బి.జగన్నాథరావు ఆదేశించారు. గురువారం స్థానిక సీహెచ్‌సీలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన పీహెచ్‌సీల వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో ఆయన సమీక్షించారు. గర్భిణులు, బాలింతలు, శిశువులు, బాలికల్లో రక్తహీనత గుర్తించి వెంటనే నివారణా చర్యలు చేపట్టాలన్నారు. హిమోగ్లోబిన్ శాతం వృద్ధి చెందే వరకు పర్యవేక్షణ ఉండాలని సూచించారు. శిశు ఆరోగ్య పర్యవేక్షణ అవసరమన్నారు. సమావేశంలో డీఎంవో టి.జగన్మోహన్‌రావు, ఆర్‌బీఎస్ ప్రోగ్రాం అధికారి రఘుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాటిచ్చారు.. మరిచారు



- జంఝావతిపై వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం
- పనులు పూర్తిచేస్తామని పాదయాత్రలో జగన్ హామీ
- అధికారంలోకి వచ్చాక పట్టించుకోని ముఖ్యమంత్రి
- గాలిలో కలిసిన ఎత్తిపోతల పథకం
- ఏటా రైతులకు తప్పని సాగునీటి కష్టాలు

(పార్వతీపురం- ఆంధ్రజ్యోతి/గరుగుబిల్లి)

'వైసీపీ అధికారంలోకి రాగానే.. మన్యం జిల్లాకు కల్పతరువైన జంఝావతి సాగునీటి ప్రాజెక్టు పనులు పూర్తిచేస్తాం.. పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు అందిస్తాం.. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూస్తాం.' అని గత ఎన్నికల సమయంలో పార్వతీపురంలో ప్రతిపక్ష నేతగా జగన్ హామీ ఇచ్చారు. ఇదే సమయంలో అప్పటి టీడీపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ ఒక్కసారి కూడా జంఝావతి ఊసెత్తలేదు. ఐదేళ్ల కాలంలో వాటి పనులపై దృష్టిసారించలేదు. ప్రాజెక్టుకు ఒడిశాతో ఉన్న వివాదాలను కూడా పరిష్కరించలేకపోయారు. మొత్తంగా సీఎం జగన్ రైతులకు ఇచ్చిన హామీని నీటి మూటగానే మారింది. 'మాట తప్పను.. మడమ తిప్పను' అని గొప్పలు చెప్పుకునే జగన్.. నాటి పాదయాత్రలో ఇచ్చిన హామీని పూర్తిగా మరిచి ఆయకట్టుదారులకు నిరాశే మిగిల్చారు.

ఇదీ పరిస్థితి..

జిల్లా పరిధిలోని గరుగుబిల్లి, కొమరాడ, సీతానగరం, పార్వతీపురం మండలాల్లో సుమారు 24,640 ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో జంఝావతి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. అయితే ఒడిశాతో ఉన్న వివాదం తేలకపోవడంతో ప్రాజెక్టు మిగులు పనులు ముందుకు సాగలేదు. ప్రాజెక్టుకు గేట్లు అమర్చి ప్రస్తుతం రబ్బర్ డ్యామ్ ఉన్న ప్రదేశాన్ని పూర్తిగా మూసేస్తే 24 వేల ఎకరాలకు సాగునీరు అందిందొచ్చు. కానీ ఒడిశా రాష్ట్రంలో అటవీ ప్రాంతం ముంపునకు గురయ్యే అవకాశం ఉండడంతో ఆ ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం లేదు. మరోవైపు జంఝావతి ద్వారా ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసి 10 డిస్ట్రిబ్యూటరీ కాలువ ద్వారా సాగునీరు అందించే ఏర్పాటు చేశారు. అయితే 9 వేల ఎకరాల మించి సాగునీరు అందడం లేదు.

- ఈ ప్రాజెక్టు పరిధిలో కాలువల నిర్వహణకు కూడా వైసీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. కాలువల తవ్వకాలు పూర్తి చేసినప్పటికీ వాటిని అనుసంధానం చేసే పనులు ఇంకా ప్రారంభించలేదు. 6.4 మీటర్ల బెడ్ విడ్త్ ఉండాల్సిన కాలువలు 2.5 మీటర్లు మాత్రమే ఉన్నాయి. పూర్తిస్థాయిలో తవ్వితే కొంతవరకు పొలాలకు సాగునీరు చేరే వీలుంది. అయితే ఐదేళ్ల పాలనలో వైసీపీ సర్కారు ఆ పనులేవీ చేపట్టలేదు.
- కొమరాడ మండలం గంగభద్ర వద్ద కాలువ భారీ లోతుగా ఉండడంతో ఎక్కడనుంచే నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. ఇక చెరువులకు, కాలువలను అనుసంధానిస్తే వేల ఎకరాలకు సాగునీరు అందించే వీలుంది. పార్వతీపురం మండలం పెద్దండపల్లి, తామరచెరువు నింపితే సుమారు మూడు వేల ఎకరాలకు సాగునీరును అందించొచ్చు. ఇదే మండలంలో తాళ్లబురిడి వద్ద సాకిగడ్డకు అక్విడెక్ట్ నిర్మిస్తే మక్కువ మండలానికి సాగునీరును అందించవచ్చు. కానీ వైసీపీ ప్రభుత్వం జంఝావతిపై పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఇచ్చిన హామీని పూర్తిగా మరిచి.. కనీస స్థాయిలో పనులు చేయకుండా రైతులకు కన్నీళ్లే మిగిల్చింది.
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు చేశారు. కాలువలు, డ్రాపులు, ఆక్విడెక్టులతో పాటు పలు సౌకర్యాలకు ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు అవసరమైన కాలువలు నిర్మించారు. అయితే వైసీపీ అధికారంలోకి రాకపోవడంతో ఎత్తిపోతల పథకం మూలకు చేరింది. సకాలంలో బిల్లుల చెల్లింపులు చేయలేదు. దీంతో పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. దీంతో శివారు భూములకు ఏటా సాగునీరందడం లేదు.
- స్థానిక వనరులను ఉపయోగించుకుని జంఝావతి ద్వారా సాగునీరు అందించేందుకు గత టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.36 కోట్లను కూడా రద్దు చేసింది. రీ టెండరింగ్ పేరిట వైసీపీ ప్రభుత్వం ఆ పనులేవీ చేపట్టలేదు.
- ఎత్తిపోతల పథకం మంజూరు చేసి రైతులకు జంఝావతి ప్రాజెక్టు నుంచి సాగునీరు అందిస్తామని కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి పలు దఫాలు హామీ ఇచ్చారు. ఒక దఫా ఎమ్మెల్యేగా, మరో దఫా ఉప ముఖ్యమంత్రిగా, రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా ఆమె ఉన్నప్పటికీ మండలంలోని సమస్యలపై అంతగా స్పందించలేదు. జంఝావతి అధికారులు ఉల్లిభద్ర, సీతారాంపురంలోని ప్రాంతాన్ని పరిశీలించి రూ.5 కోట్లతో ఎత్తిపోతల పథకం కోసం ప్రతిపాదనలు చేసినా.. కార్యరూపం దాల్చలేదు. గతంలో ఎత్తిపోతల పథకం ద్వారా ప్రత్యేకంగా విద్యుత్ ఉప కేంద్రం ఏర్పాటు చేసినా దాని నిర్వహణను వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. విద్యుత్ పనులు చేయడానికి అవసరమైన సిబ్బందిని నియమించలేదు.
- జంఝావతి ప్రాజెక్టు పరిధిలోని కాలువ నుంచి సాగునీరందక భూములు బీడు భూముల్లా మారుతున్నాయి. పలు గ్రామాలకు చెరువులు లేకపోవడంతో కాలువపైనే రైతులు ఆధారపడాల్సిన వస్తోంది. అయితే పూర్తి స్థాయిలో దాని నుంచి నీరందకపోవడంతో ఏటా వారు వరుణుడిపైనే భారం వేసి సాగు చేపట్టాల్సి వస్తోంది.



పార్వతీపురం మండలం చిన్నబొండపల్లి వద్ద జంఝావతి హైలెవల్ కెనాల్ కాలువ పరిస్థితి ఇదీ..



ఎత్తిపోతల పథకానికి సీతారాంపురంలో ప్రతిపాదించిన ప్రాంతం

నిధుల కేటాయింపు ఇలా..

వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత జంఝావతి ప్రాజెక్టుకు అరకొరగానే నిధులు కేటాయించింది. 2018-2019లో రూ. 30 లక్షలు, 2020-21లో రూ. రెండు లక్షల 25 వేలు, 2021-22లో రూ. ఐదు లక్షలు, 2022-23లో రూ.ఆరు లక్షలు మాత్రమే మంజూరు చేశారు. ఈ నిధులతో జంఝావతి ప్రాజెక్టు పనులు ఎలా పూర్తి చేస్తారో సర్కారుకే తెలియాల్సి ఉంది.

ఒడిశా సీఎంతో సమావేశమైనా..

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జగన్ ఒక్కసారి మాత్రమే ఒడిశా వెళ్లి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో సమావేశమయ్యారు. కానీ జంఝావతి ప్రాజెక్టు వివాదం మాత్రం తేలలేదు. కానీ స్థానిక వైసీపీ నేతలు మాత్రం జంఝావతి ప్రాజెక్టు కోసమే సీఎం జగన్ ఒడిశా సీఎంతో సమావేశమైనట్లు గొప్పలు చెప్పుకున్నారు.

మొత్తంగా వైసీపీ సర్కారు నిర్లక్ష్యం కారణంగా జంఝావతి పరిధిలో ఆయకట్టుదారులు ఏటా సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రైతులను మోసగించారు..

ఎత్తిపోతల పథకం మంజూరు విషయంలో రైతులను మోసగించారు. హామీలే తప్ప నేటికీ ఆ సమస్య పరిష్కరించలేదు. ఖరీఫ్ సమయంలో జంఝావతి నుంచి సాగునీటి కోసం పడరాని పాట్లు పడ్డాం. వర్షాధారంపైనే సాగు చేసుకొనే పరిస్థితి ఏర్పడింది. ఎత్తిపోతల పథకం కలగా మారింది. ప్రభుత్వం మారితే రైతుల సమస్యలు పరిష్కారమవుతాయి.

-దివాకర్, ఉద్దవోలు, గరుగుబిల్లి మండలం

సాగు చేపట్టలేని పరిస్థితి..

జంఝావతి నుంచి పూర్తిస్థాయిలో సాగునీరు అందకపోవడంతో గత ఐదేళ్లుగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రు. సుమారు 6 వేల ఎకరాల పరిధిలో రైతులు పంటలు వేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. అయినప్పటికీ వైసీపీ సర్కారు స్పందించపోవడం దారుణం.

-తవిటినాయుడు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్, ఉల్లిభద్ర

జిల్లాకు ఎన్నికల పరిశీలకులు

- కంట్రోల్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన



ఎన్నికల పరిశీలకులతో కలిసి కంట్రోల్ రూమును పరిశీలిస్తున్న కలెక్టర్

పార్వతీపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎలక్షన్ కమిషన్ నియమించిన ఎన్నికల పరిశీలకులు జిల్లాకేంద్రానికి వచ్చారు. గురువారం వారిని కలెక్టర్ నిశాంత్‌నిశాంత్‌కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో ప్రశాంత ఎన్నికల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలు, సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు, పటిష్ఠ నిఘా తదితర అంశాలపై వివరించారు. అనంతరం ఎన్నికల పరిశీలకులు ప్రమోద్‌కుమార్ మెహర్ద, నయిం ముస్తఫా మన్సూరీలు కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఎన్నికల ప్రవర్తన నియమావళి, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానటరింగ్ సెల్, మీడియా సెంటర్, సోషల్ మీడియా విభాగం, వ్యయ విభాగం, జియో టాకింగ్ వాహనాల పర్యవేక్ష విభాగాలను పరిశీలించారు. ఆ తర్వాత గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర ఉద్యాన కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ పరిశీలనలో జాయింట్ కలెక్టర్ శోభిక, ఇన్‌చార్జి డీఆర్వో కేశవనాయుడు, ఎంసీసీ నోడల్ అధికారి ఎండీ గయాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో జిల్లా విద్యార్థుల సత్తా..

సాలూరు రూరల్/ పాలకొండ, ఏప్రిల్ 25: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. పాలకొండకు చెందిన చింటు సతీష్ కుమార్ ఆల్ ఇండియా స్థాయిలో ఓపెన్ కేటగిరీలో 8వ ర్యాంకు ఓబీసీ కేటగిరీలో రెండో స్థానం సాధించి సత్తాచాటాడు. పాలకొండకు చెందిన ఈ విద్యార్థి ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు విశాఖలో విద్యనభ్యసించాడు. పదో తరగతి ఫలితాల్లో పదికి పది పాయింట్లు సాధించారు. ఇంటర్ సీబీఎస్ఈ ఫలితాలు ఇంకా వెలువడాల్సి ఉంది. సతీష్‌కుమార్ తల్లిదండ్రులు చింటు బుచ్చెన్న లుంబూరులోని ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి రమాదేవి విజయనగరం జిల్లా రేగిడి ఆమదాలవలస మండలంలోని ఆమదాలవలస కాలనీలో టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. జేఈఈ మెయిన్స్‌లో సతీష్‌కుమార్ ఉత్తమ ప్రతిభ కనబర్చడంపై తల్లిదండ్రులతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఇంజనీర్‌గా స్థిరపడడం తన లక్ష్యమని సతీష్ కుమార్ తెలిపారు.



పాలకొండ: ఆలిండియా స్థాయిలో 8వ ర్యాంకు సాధించిన సతీష్



సాలూరు రూరల్: లోచన్ (ఆలిండియా స్థాయిలో 93వ ర్యాంకు)

ఫలితాల్లో మెరిసిన లోచన్

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సాలూరుకు చెందిన మరడాన సాయి శివ లోచన్ ఆలిండియా జనరల్‌లో 93వ ర్యాంక్, ఓబీసీలో 16వ ర్యాంక్‌ను సాధించాడు. తొలి, రెండో విడత ఫలితాల్లో సగటున 99.99 శాతం చొప్పున పర్సెంటైల్‌ను సాధించాడు. ఆ విద్యార్థి పదో తరగతి వరకు గుడివాడ, ఇంటర్ విజయ వాడలో చదివాడు. లోచన్ తండ్రి మోహనరావు, తల్లి సునీత పాచిపెంట మండలంలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. కాగా లోచన్ వచ్చే నెల 26న జరగనున్న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను రాయనున్నాడు. జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో మంచి ర్యాంక్ సాధించిన ఆ విద్యార్థికి గురువారం పలువురు ఉపాధ్యాయులు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు , పాచిపెంట ఎంఈవోలు తదితరులు అభినందనలు తెలిపారు.



సాలూరులో పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

నేటితో గడువు పూర్తి

- పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుల స్వీకరణకు..

సాలూరు రూరల్, ఏప్రిల్ 25: పోలింగ్ విధులు నిర్వహించే ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు (ఫారం-12) అందించడానికి నేటితో గడువు ముగియనుంది. అయితే ఇప్పటికే కురుపాం, పార్వతీపురం, పాలకొండ నియోజకవర్గాల్లో పలువురు తమకు పోస్టల్ బ్యాలెట్ కావాలని దరఖాస్తులందించారు. వాస్తవంగా పోస్టల్ బ్యాలెట్ల దరఖాస్తుల స్వీకరణకు తొలుత గడువు ఈ నెల 15 కాగా దానిని 22కు పొడిగించారు. ఆ తర్వాత ఈ గడువును 26కు పెంచారు. సాలూరులో గురువారం నాటికి 800 మందికి పైగా ఉద్యోగులు తమకు పోస్టల్ బ్యాలెట్ కావాలని దరఖాస్తు చేసుకున్నారు. నేడు పూర్తిస్థాయిలో దరఖాస్తులు రావొచ్చని రెవెన్యూ సిబ్బంది చెబుతున్నారు. జిల్లాలో 769 ప్రాంతాల్లో 1031 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. వాటిల్లో వచ్చే నెల 13న పోలింగ్ నిర్వహణకు గాను 1240 మంది పీవోలు, 1199 ఏపీవోలు, దాదాపు 4000 మంది ఓపీవో (అదర్ పోలింగ్ ఆఫీసర్లు)ను నియమించారు. వారంతా పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తులు (ఫారమ్ 12) చేసుకోవాల్సి ఉంది.

ముగిసిన కీలక ఘట్టం

- అరకు పార్లమెంట్‌కు 32, శాసనసభ స్థానాలకు 61 నామినేషన్లు దాఖలు



పార్వతీపురంలో టీడీపీ అభ్యర్థి నామినేషన్‌కు తరలివచ్చిన కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు



పార్వతీపురంలో ఆర్వోకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న టీడీపీ అభ్యర్థి విజయచంద్ర



సాలూరులో ఆర్వోకు నామినేషన్ పత్రాలు అందిస్తున్న టీడీపీ అభ్యర్థి సంధ్యారాణి



సాలూరులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు

పార్వతీపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి)/కురుపాం/ సాలూరు/ సీతంపేట : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈ నెల 18 నుంచి ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. గురువారం మధ్యాహ్నం 3 గంటలతో పార్లమెంట్, శాసన సభ నియోజకవర్గాలకు నామినేషన్ల గడువు ముగిసిందని అధికారులు వెల్లడించారు. కాగా జిల్లాలో నాలుగు శాసన సభ స్థానాలకు 61, అరకు పార్లమెంట్‌కు 32 నామినేషన్లు పడ్డాయి. టీడీపీ, వైసీపీ, సీపీఎం, సీపీఐ, స్వతంత్ర అభ్యర్థులుగా పలువురు నామినేషన్లు దాఖలు చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి పాలకొండలో చివరి రోజు ఆరు నామినేషన్లు పడ్డాయి. దీంతో గడువు ముగిసిన నాటికి మొత్తంగా నామినేషన్ల సంఖ్య 12గా నమోదైంది. కురుపాంలో ఐదు నామినేషన్లు దాఖలవగా.. మొత్తంగా ఇక్కడ 17 మంది నామినేషన్లు వేశారు. పార్వతీపురంలో ఏడుగురు నామినేషన్ల పత్రాలు ఇవ్వగా.. వాటి సంఖ్య 17కు చేరింది. సాలూరులో ఏడు నామినేషన్లు దాఖలవగా.. మొత్తం నామినేషన్ల సంఖ్య 15గా నమోదైంది. కాగా గురువారం పార్వతీపురం నియోజకవర్గానికి సంబంధించి టీడీపీ అభ్యర్థిగా బోనెల విజయచంద్ర, సాలూరులో టీడీపీ అభ్యర్థిగా గుమ్మిడి సంధ్యారాణి నామినేషన్లు వేశారు. వారు కాకుండా కురుపాం నుంచి టీడీపీ అభ్యర్థి తోయక జగదీశ్వరి, పాలకొండ నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణ ఇంతకముందే నామినేషన్ పత్రాలు అందించారు. అరకు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి చివరి రోజు స్వతంత్ర అభ్యర్థులు పదిమంది నామినేషన్లు వేశారు. బీజేపీ నుంచి మాజీ ఎంపీ కొత్తపల్లి గీత ఇంతకముందే నామినేషన్ పత్రాలు అందించారు. కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ తదితర పార్టీలతో పాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్లు వేశారు. కాగా ఈనెల 26న నామినేషన్ పరిశీలన ఉంటుంది.. 29న మూడు గంటల్లోపు నామినేషన్లు ఉపసంహరణ చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు.

రెండో ఈవీఎంను ఎప్పుడు వినియోగిస్తారంటే...



(కొమరాడ)

అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఒక నియోజకవర్గంలో 16 మంది కంటే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉంటే రెండో ఈవీఎంను ఉపయోగిస్తారు. ఒక ఈవీఎం లో 16 మంది వివరాలు మాత్రమే రికార్డు చేసేందుకు వీలుంటుంది. అంతకంటే ఎక్కువమంది బరిలో ఉంటే తప్పకుండా మరో ఈవీఎంను ఉపయోగించాలి. ఉదాహరణకు 18 మంది అభ్యర్థులు రంగంలో ఉంటే మొదటి ఈవీఎంలో 16 మంది అభ్యర్థుల వివరాలు, రెండో ఈవీఎంలో ఇద్దరి వివరాలు ఉంచుతారు. దీంతో పాటు ఏ పోలింగ్ కేంద్రంలో అయినా ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తరువాత మధ్యలో ఈవీఎం మొరాయిస్తే అప్పటి వరకు నమోదైన వివరాలు సీజ్ చేసి రెండో ఈవీఎంను వినియోగిస్తారు.

మీకు తెలుసా.?

(రాజాం రూరల్)



రాజ్యాంగంలోని 84 (ఎ) ప్రకారం భారతపౌరుడు కాని వ్యక్తి పార్లమెంటు ఎన్నికలలో అభ్యర్థిగా పోటీచేసే వీలులేదు. రాజ్యాంగంలోని 173 (ఎ) ప్రకారం శాసనసభకూ ఇదే నిబంధన వర్తిస్తుంది.

● ప్రజా పాతినిధ్య చట్టం 1951 లోని సెక్షన్ 4 (బి) ప్రకారం ఏ నియోజకవర్గంలోనూ ఓటరుగా నమోదు కాని వ్యక్తి పోటీకి అనర్హుడు.

● ప్రజాపాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 4 (సి), 4 (సిసి), 4 (సిసిసి) ప్రకారం ఒక రాష్ట్రానికి చెందిన వ్యక్తి మరొక రాష్ట్రంలో పోటీచేసే వీలుంది. అయితే ఈ సెక్షన్ల ప్రకారం అసోం, లక్షదీవులు, సిక్కిం రాష్ట్రాలలో పోటీ చేసేందుకు వీలుకాదు.

● జైలులో ఉన్న వ్యక్తి గానీ.. ఒక జైలు నుంచి మరొక జైలుకు తరలుతున్న వ్యక్తి గానీ.. పోలీసు కస్టడీలో ఉన్న వ్యక్తి గానీ ఓటు వేయడానికి వీలులేదు.

అప్పట్లో కక్షలు ఉండేవి కావు

పెద్దల మాట



సాలూరు రూరల్: ప్రస్తుత ఎన్నికల్లో కుతంత్రం ఎక్కువైంది. నాడు ఎన్నికలు స్నేహపూర్వక వాతావరణంలో జరిగేవి. పోటీ చేసిన వారి మధ్య కక్షలు ఉండేవి కాదు. 1972లో తొలి ఓటు వేశాను. అప్పట్లో ఉదయాన్నే ఓటు వేయడానికి వచ్చిన వారికి... పోటీచేసిన వారు టిఫిన్లు ఏర్పాటు చేసే వారు. అది లంచం కింద కాదు. రిక్షాలు ఏర్పాటు చేసే వారు. ఏ రిక్షాలో వెళ్లినా... మరో పోటీదారులు ఫలానా వారు ఆ రిక్షాలో వెళ్లారని అసూయ పడేవారు కాదు. అలా వెళ్లిన వారిపై కక్ష సాధింపునకు దిగే వారు కాదు. ఇప్పుడు అలా కాదు. వీళ్లు మనోళ్లు, వారు వాళ్లోళ్లు అని గిరి గీసుకుంటున్నారు. గెలుపు కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. నాడు ఎన్నికల్లో ఫలితాలు కోసం బ్యాలెట్లు లెక్కింపు పూర్తయ్యేసరికి దాదాపు రెండు రోజులు ఎదురు చూసేవాళ్లం. ఈవీఎంలు రావడంతో ఫలితాలు తొందరగానే తెలుస్తున్నాయి. ఎన్నికలను యుద్ధంగా వర్ణించడం తగదు. ఎన్నికలు ముగిసిన తరువాత అభివృద్ధి కోసం విజేత, పరాజితులు సహాయ సహకారాలు అందించుకొని అందరినీ సమదృష్టితో చూడాలి.

- లావేటి సన్యాసిరావు (85), సాలూరు అర్బన్‌బ్యాంక్ మాజీ అధ్యక్షుడు

పోస్టల్ బ్యాలెట్ వినియోగం ఇలా..

కొమరాడ: ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బందికి పోలింగ్ రోజు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉండదు. కాబట్టి వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు పోలింగ్ కంటే ముందే తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకుంటారు. ఇందు కోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

ఎవరు అర్హులంటే

ఎన్నికల విధుల్లో ఉండే అధికారు లు, సిబ్బంది, పోలీసులు, పాత్రికేయులు పోస్టల్ బ్యాలెట్‌కు అర్హులు. ప్రిసైడిం గ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికా రులు, ఏపీవో (అదర్ పోలింగ్ ఆఫీసర్స్), ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్, అకౌంటింగ్, సెక్టోరల్ అధికారులు, బీఎల్‌వోలు, పోలీసు, అత్యవసర సేవల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ పొందేందుకు అర్హులు. వీరికి ఆయా విభాగాల హెడ్‌ల ద్వారా ఫారం-12 దరఖాస్తులు ఇస్తారు. దీనిని పూర్తి చేసి సంబంధిత ఏఆర్‌వోకు పంపించాలి. ఇలా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆ ఉద్యోగికి ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తారు. ఒక ప్రాంతంలో ఓటు ఉండి వేరే ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న వారికి సొంత ఊరిలో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంది. పోస్టల్ బ్యాలెట్ కోసం ఉద్యోగులకు ప్రత్యేకంగా ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తారు. అక్కడకకు వెళ్లి తమ ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది. పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుకు ఈ నెల 26వ తేదీ వరకు గడువు ఉంది.

ఫెసిలిటేషన్ సెంటర్లలో వినియోగం

గతంలో ఎన్నికల విధుల్లో ఉండే అధికారులు, సిబ్బందికి బ్యాలెట్ పేపర్‌ను ఇంటికి పంపేవారు. అక్కడ ఓటు పూర్తి చేసి కవర్‌లో పెట్టి సంబంధిత అధికారికి ఇచ్చేవారు. కొన్ని చోట్ల ఇది దుర్వినియోగం అవుతుం డటంతో కొత్త నిబంధన 18ఎ తెచ్చారు. దీని ప్రకారం ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌లోనే వారికి బ్యాలెట్ ఇస్తారు. దీనిని ఇంటికి తీసుకువెళ్లేందుకు అనుమతించరు. ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌లోనే నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలి. ఆ తరువాత ఆ బ్యాలెట్ పేపర్‌ను, ప్రమాణ పత్రాన్ని జత చేసి కవర్‌లో పెట్టి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పెట్టెలో వేయాలి. పోస్టల్ బ్యాలెట్ వినియోగం మే 4, 5, 6 తేదీలలో జరగనుంది. ఏ తేదీన, ఏ విభాగం అధి కారులు ఓటు వేయాలో ఉన్నతాధికారులు తెలియజేస్తారు. ఆ సమయంలో వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంది. ఈ పోస్టల్ బ్యాలెట్‌ను ఈవీఎంలతో పాటు లెక్కిస్తారు.




ఓటు.. నడిపిస్తున్న నోటు!

● ఎన్నికల్లో డబ్బే కీలకం

● సమయం తక్కువ.. ఖర్చు ఎక్కువ

(రాజాం రూరల్)





'అన్నిసార్లూ ఓటు రూ.500కే దొరకదు. ఒక్కోసారి పరిస్థితులను బట్టి ఓటుకు రూ.1000 ఇవ్వాలి. అవసరమైతే రూ.5000 కూడా ఇవ్వాలి. అధికారం కావాలంటే ఎన్ని వందల కోట్లయినా ఖర్చు పెట్టాలి..' ఇవీ ఓ సినిమాలో కథానాయకుడు అన్న మాటలు. సినిమా డైలాగులను పక్కన పెడితే.. అంతగా ఖర్చు చేయకపోయినా భారీగా డబ్బు లేనిదే ఎన్నికలు లేవన్నది వాస్తవం... డబ్బుకు లోకం దాసోహం అన్నారు. ఎన్నికల వేళ కోట్లు ఖర్చు చేసేందుకు నేతలు సిద్ధంగా ఉన్నారు. ఎన్నికల సంఘం జిల్లాకు ముగ్గురు ఐఆర్‌ఎస్ అధికారులను వ్యయ పరిశీలకులుగా నియమించింది. వీరిలో ఒకరు పార్లమెంట్‌కు, ఇద్దరు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థులు ఖర్చులను లెక్కిస్తున్నారు. వీరే కాకుండా జిల్లా ఎన్నిక అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలతో అధికార యంత్రాంగ నిఘాతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది.

జిల్లాలో పరిస్థితి



జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో అధికార వైసీపీ, తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు ప్రచారాన్ని ఉద్ధృతం చేశారు. కాంగ్రెస్ తదితర పార్టీలు సైతం తమదైన రీతిన ప్రచారం ప్రారంభించాయి. అధికారం దక్కించుకోవాలని తెలుగుదేశం కూటమి అభ్యర్థులు... రెండోసారి విజయం సాధించి రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలని వైసీపీ అభ్యర్థులు ఎన్నికల కురుక్షేత్రంలోకి దిగాయి. ఈ ఎన్నికలో ఎంత ఖర్చు చేయగలరో తెలుసుకుని కొన్ని పార్టీలు టికెట్లు ఇస్తున్న నేపథ్యంలో ఈసారి డబ్బు ఏరులై పారడం కచ్చితమని తేలుతోంది. మరి అభ్యర్థుల ఖర్చు ఎలా ఉండాలో.. ఎంత ఉంటోందో ఓసారి చూద్దామా?

జిల్లాలో రూ.500 కోట్లు పైమాటే..

ఏడు నియోజకవర్గాలలో రెండు ప్రధాన పార్టీల నుంచి 14 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. వీరే సుమారు రూ.300 కోట్లు వరకు ఖర్చు చేస్తారన్నది ఓ అంచనా. ఇతర పార్టీల అభ్యర్థులను పరిశీలిస్తే మరో రూ.పదికోట్లు ఖర్చు చేసే అవకాశాలు లేకపోలేదు. ఎన్నికల ప్రకటన వెలువడిన నాటి నుంచి రెండు ప్రధాన పార్టీల ఖర్చు ఇప్పటికే సుమారు రూ.100 కోట్లు దాటిందనడం సందేహం లేదు. అధికార పార్టీ అభ్యర్థులు నియోజకవర్గంలో కనీసం రూ.50 కోట్లు ... ఆపై ఖర్చు చేసేందుకు కూడా వెనుకంజ వేయడం లేదన్నది వాస్తవం.

అధికారికంగా...

ఎమ్మెల్యేగా పోటీలో ఉన్న అభ్యర్థి రూ.40 లక్షలు, ఎంపీగా బరిలో దిగిన అభ్యర్థి రూ.95 లక్షలకు మించి ఖర్చు చేయకూడదని ఎన్నికల సంఘం నిబంధన. ఈ ఖర్చులు రికార్డులకే పరిమితం. వాస్తవంగా జరుగుతున్న ఖర్చు ఎంతనేది జగమెరిగిన సత్యం. పాదయాత్రలు, బహిరంగ సభలు, రోజువారీ కార్యకర్తలు, నాయకుల ఖర్చులు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ, ప్రచారం ఖర్చులు... వాహనాల పెట్రోల్... ఇలా అన్నీ కలిపి అంచనాలు దాటుతాయి. ఇక నామినేషన్ వేసిన ఒక్క రోజు చేసిన ఖర్చు అతని స్థాయిని తెలియజేస్తుంది. ఇదే గెలుపోటములపై ప్రజల్లో ఓ అంచనా వేసేందుకు కీలకంగా మారుతుందనడంలో సందేహం లేదు.

ఎంపీ నియోజకవర్గాలలో..

విజయనగరం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో జిల్లాలోని ఆరు నియోజనవర్గాలతో పాటు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గం కూడా కలిసి ఉంది. ఎంపీ అభ్యర్థి తన పరిధిలో గల అసెంబ్లీ పరిధిలోని ఖర్చులను కూడా కొంతమేర భరించాల్సి ఉంటుంది. ఇందుకోసం రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందనడం అతిశయోక్తి కాదు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే జైలే...



విజయనగరం: కొందరు అభ్యర్థులు సెంటిమెంట్‌ను రెచ్చగొడితోనే ఓట్లు పడతాయని భావించి కులం, వర్గం, ప్రాంతం పేరుతో ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారు. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలను అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల సంఘం నియమా వళిలో కఠిన నిబంధనలు రూపొందించింది. ఎన్నికల్లో ఎవరైనా జాతి, మత, కుల, భాష, సమాజం పేరుతో రెచ్చగొడితే ఆర్‌పీ చట్టం-1951 సెక్షన్ 125, ఐసీసీ సెక్షన్ 153ఏ ప్రకారం మూడేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తారు. ఓటు కోసం మద్యం, డబ్బులు, ఇతర వస్తువులను తీసుకున్న వారిని కూడా నేరస్థులగానే పరిగణిస్తారు. ఐపీసీ సెక్షన్ 171బి, 171 ఈ, హెచ్ ప్రకారం లంచంగా పరిగణించి ఏడాది జైలు శిక్ష విధిస్తారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రవాహంపై నిఘా పెంచారు. నజరానాలకు లొంగినా, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

కత్తులు దూసేవారిపై నిఘా

● సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు గస్తీ

● యువత ఇరుక్కుంటే.. ఇబ్బందులు తప్పవు



గ్రామాల్లో పోలీసుల కవాతు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి హింసాత్మక సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు కల్పించాలని కలెక్టర్లకు ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. గత ఎన్నికల్లో గొడవలు, అల్లర్లు చేసిన వారిపై ఎన్నికల అధికారులు, పోలీసులు డేగ కన్నువేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి పోలీసులను అప్రమత్తం చేశారు. దీంతో సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాల్లో గట్టి బందోబస్తు ఏర్పాట్లు, అవగాహన కార్యక్రమాలను పోలీసు యంత్రాంగం చేపట్టింది. జిల్లాలో సుమారు 267 వరకు సమస్యాత్మక, అతి సమసాత్మక ప్రాంతాలు ఉన్నాయి.

శాంతియుతంగా ఎన్నికలు జరగాలి: కలెక్టర్



కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం జిల్లా అంటేనే శాంతికాముకులుగా పేరుగాంచింది. ఎందరో మహానుభావులకు జన్మనిచ్చిన నేల. ఇక్కడి ప్రజలు గొడవలు, అల్లర్లకు దూరంగా ఉంటారని చెబుతుంటారు. వచ్చే ఎన్నికలలో ఎటువంటి సమస్యలు లేకుండా ప్రజలందరూ సహకరించి ఎన్నికలు సజావుగా సాగేలా చూడాలి. ముఖ్యంగా యువత ప్రలోభాలకు లొంగకుండా... గొడవల్లో కలుగజేసుకోకుండా స్వేచ్ఛాయుత వాతవరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలి. జిల్లాకు ఉన్న మంచి పేరును కొనసాగిద్దాం.



తప్పెటగుళ్ల కళాకారులు

ఎన్నికల ప్రచారంలో తప్పెటగుళ్లు ఉండాల్సిందే..

సందడి

విజయనగరం: ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో తప్పెటగుళ్ల సందడి కనిపిస్తోంది. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా తప్పెటగుళ్లతో కళాకారులు ఆడిపాడుతున్నారు. ఎన్నికల ప్రక్రియలో ముందుగా నిర్వహించే నామినేషన్ల పర్వంలోనే ఎక్కువ సందడి ఉంటుంది. ఈ కార్యక్రమానికి ఎంత బాగా జనసమీకరణ చేస్తే, అంతకంటే జోరుగా ప్రచారం సాగుతుందని రాజకీయ పార్టీల విశ్వాసం. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏ ముఖ్య నేత వచ్చినా స్వాగతం పలికేందుకు తప్పెటగుళ్ల కళాకారులు ముందుంటారు. శ్రీకాకుళం జిల్లా ఎస్ఎంపురం, పెద్దపాడు, ముద్దాడ, అల్లినగరం, బుడుమూరు, బావాజీపేట, జొన్నలపాడు తదితర గ్రామాల్లో సుమారు 1200 మంది తప్పెటగుళ్ల కళాకారులు ఉన్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కళాకారులు ప్రచార కార్యక్రమాల్లో సందడి చేశారు.

పార్టీలకు కొమ్ము కాస్తే ఉద్యోగం ఊడినట్లే..

(కొమరాడ)



ప్రభుత్వ ఉద్యోగులు ఏ పార్టీకీ బహిరంగంగా మద్దతు తెలపకూడదు. అనుకూలంగా ప్రచారం చేయకూడదు. ఉద్యోగులకు వివిధ రాజకీయ పార్టీలు, నాయకులపై అభిమానం ఉన్నప్పటికీ ఎన్నికల ప్రచారంలో, ఇతర కార్యక్రమాల్లో పాల్గొనకూడదు. ఉద్యోగులు ఎవ్వరైనా ఎన్నికల కార్యక్రమాల్లో పాల్గొంటే వారిపై చర్యలు తీసుకునే విధంగా ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ, కాంట్రాక్టు ఉద్యోగులు రాజకీయ పార్టీలకు మద్దతు ఇవ్వకూడదు. ఉద్యోగులు ఎన్నికల్లో ఓటు వేయవచ్చు. ఎన్నికల్లో అభ్యర్థుల పక్షాన ప్రచారం చేస్తే భారీ మూల్యం చెల్లించకతప్పదు. ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రచారం చేసినట్లు ఆధారాలతో రుజువైతే ఉద్యోగానికి ఎసరు వస్తుంది. ప్రభుత్వం నుంచి ఏ రకంగానైనా, నెల నెలా డబ్బులు పొందేవారు ఎన్నికల ప్రచారం చేయడానికి అనర్హులు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా చాలా మంది వలంటీర్లు, ఆర్పీలను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఎన్నికల ప్రచారంలో ఉద్యోగులు భాగస్వాములు కావడం వివాదానికి దారి తీస్తుంది. మోటార్ బైక్‌ల ర్యాలీలు, సాధారణ ర్యాలీలు, సభలలో పాల్గొనకూడదు. ఒక పార్టీకి చెందిన వారు మరో పార్టీ వారి రోజు వారీ ప్రచారాలు, ఇతర కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఎప్పుడు ఏం చేస్తున్నారో, ఏ సమయంలో ఏం చేస్తున్నారో, రికార్డింగ్ చేస్తున్నారు. స్మార్ట్ ఫోన్‌లలో చిత్రీకరించి సంబంధిత క్లిప్‌లను నేరుగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి పంపుతున్నారు. ఆధారాలు ఉంటే ఎన్నికల అధికారులు వెంటనే చర్యలు తీసుకుంటున్నారు.

● వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు కూడా జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంది. పార్టీలకు సంబంధం లేకుండా సమావేశాలు నిర్వహించాలి. లేదంటే ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద వస్తుంది. ఆధారాలతో ఎవరైనా జిల్లా ఉన్నతాధికారికి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

● ప్రస్తుతం దాదాపు ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంది. పాఠశాల విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు స్మార్ట్ ఫోన్‌లను వినియోగిస్తున్నారు. పార్టీ నేతలు ప్రచారంలో పాల్గొంటే, వారితో ఫొటోలు దిగడం, ర్యాలీలు, ప్రచార కార్యక్రమాల ఫొటోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడం, ఫోన్‌లు చేయడం పరిపాటిగా మారింది. సోషల్ మీడియా ఆధారాలతో కూడా ఉద్యోగులపై అధికారులు వేటు వేసే అవకాశం ఉంది. అందుకే ఉద్యోగులు ప్రచారానికి దూరంగా ఉండాలి. ఉద్యోగులే కాకుండా ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం పొందే వారంతా పార్టీల ప్రచారంలో పాల్గొనడం ఎన్నికల నియమావళి ఉల్లంఘన కిందకే వస్తుంది.

పీపుల్స్ మేనిఫెస్టో

అభివృద్ధి కావాలి



సాలూరు రూరల్: ప్రజలకు భరోసా కావాలి. ఎన్నికల్లో విజయం కోసం ఏవో హామీలివ్వడం కాదు. సంక్షేమంతో పాటు అభివృద్ధి కావాలి. నాలుగు కాసులివ్వడం కాదు. సంపాదించడం నేర్పితే బాగుంటుంది. ఉపాధిని అందరికీ అందించాలి. ప్రలోభాలకు లొంగ వద్దు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఓటు వేస్తాను.

- ఏరుబోతు అప్పారావు, మామిడిపల్లి

జన కేతనం
ఆంధ్రజ్యోతి
శుక్రవారం 26 ఏప్రిల్ 2024




పార్వతీపురం కలెక్టరేట్

పార్వతీపురం నియోజకవర్గానికి ఈసారి ఓ ప్రత్యేకత ఉంది. ఒకప్పుడు విజయనగరం జిల్లాలో ఉన్న ఈ ప్రాంతం కొత్తగా పార్వతీపురం మన్యం జిల్లాగా అవతరించింది. కొత్త జిల్లాలో తొలిసారిగా జరుగుతున్న ఎన్నికలు కావడంతో అందరి చూపూ ఈ నియోజవర్గంపైనే ఉంది. ఇక్కడి ఓటరు తీర్పు ఎలా ఉంటుందో...ఎవరిని ఎన్నుకుంటారోనని అందరూ ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

పార్వతీపురం నియోజకవర్గ ముఖచిత్రం

పురం.. ఎవరికో వరం



పార్వతీపురం నియోజకవర్గం మ్యాప్

- కొత్త జిల్లాలో తొలి ఎన్నికలు
- టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికే ఈసారి మొగ్గు

(పార్వతీపురం, ఆంధ్రజ్యోతి)

పార్వతీపురం మన్యం జిల్లా ఆవిర్భవించిన తరువాత తొలిసారిగా ఎన్నికలు వస్తున్నాయి. పార్వతీపురం నియోజకవర్గం 2019 సార్వత్రిక ఎన్నికల వరకు ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉండేది. జిల్లాల విభజన తర్వాత పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంగా ఆవిర్భవించింది. 2009లో పునర్విభజనకు ముందు మక్కువ, గరుగుబిల్లి, కొమరాడ, పార్వతీపురం మండలాలతో పాటు పార్వతీపురం పట్టణం ఈ నియోజకవర్గంలో ఉండేవి. అప్పటి వరకు పార్వతీపురం నియోజకవర్గం జనరల్ కేటగిరిలో ఉండేది. 2009లో పునర్విభజన తరువాత మక్కువ, గరుగుబిల్లి, కొమరాడ మండలాలను తప్పించి కొత్తగా సీతానగరం, బలిజిపేట మండలాలను చేరుస్తూ పార్వతీ పురం పట్టణంతో పాటు పార్వతీపురం మండలాన్ని కలుపుకొని నియోజ కవర్గం ఏర్పడింది. పునర్విభజన అనంతరం ఈ నియోజకవర్గం షెడ్యూల్ కులాలకు కేటాయిం చారు. అప్పటి నుంచి ఆ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు శాసన సభ్యులుగా ఉంటున్నారు. 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచి సవరపు జయమణి, 2014లో టీడీపీ తరపున బొబ్బిలి చిరంజీవులు, 2019లో వైసీపీ నుంచి అలజంగి జోగారావు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. ప్రస్తుత ప్రజల నాడి చూస్తే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థికే విజయావకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది.

నియోజకవర్గంలో ఓటర్లు...


పార్వతీపురం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 1,89,565 మంది. ఇందులో పురుషులు 93,395 మంది, మహిళలు 96,159, థర్డ్ జెండర్ 11 మంది ఉన్నారు.

నియోజకవర్గ ప్రత్యేకత..

పార్వతీపురం నియోజకవర్గంలో కిలోమీటరులోపు రెండు రైల్వేస్టేషన్లు ఉన్నాయి. పార్వతీపురం టౌన్ రైల్వేస్టేషన్‌తో పాటు బెలగాం రైల్వేస్టేషన్ ఉన్నాయి.

ఒకప్పుడు డివిజన్ కేంద్రం...


రెండేళ్ల క్రితం వరకు పార్వతీపురం పట్టణం డివిజన్ కేంద్రంగా ఉండేది. కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత జిల్లా కేంద్రంగా ఏర్పడింది. కొత్తగా జిల్లా ఆవిర్భవించిన తర్వాత బొబ్బిలి పట్టణంతో పాటు రామభద్రాపురం, తెర్లాం, బొబ్బిలి మండలాలు విజయనగరం జిల్లాలోకి వెళ్లగా... శ్రీకాకుళం జిల్లా నుంచి పాలకొండ నగర పంచాయతీతో పాటు పాలకొండ, సీతంపేట, భామిని మండలాలు కొత్తగా చేరాయి.



పార్వతీపురం పట్టణం

1952లో మొదటి ఎన్నికలు

పార్వతీపురం నియోజకవర్గానికి మొట్టమొదటి ఎన్నికలు 1952లో నిర్వహించారు. మొట్టమొదటి ఎమ్మెల్యేగా వీడీవీరభద్రదేవ్ బహదూర్ జాతీయ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికయ్యారు. ఆయన 1952 నుంచి 1962 వరకు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన మరిచర్ల వెంకటరామినాయుడు.. చీకటి పరశురామనాయుడుపై గెలుపొందారు. 1967లో వెంకటరామినాయుడు కాంగ్రెస్ తరపున ఎన్నికయ్యారు. 1972లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన చీకటి పరశురామనాయుడు.. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన మరిచర్ల వెంకటరామినాయుడిపై గెలిచారు. 1978లో జనతా పార్టీ నుంచి పోటీ చేసిన చీకటి పరశురామనాయుడు.. కాంగ్రెస్ (ఐ) పార్టీ తరపున పోటీ చేసిన వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడుపై ఎన్నికయ్యారు. 1983 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి దొడ్డి పరశురాముపై ఇంటిపెండెంట్‌గా పోటీ చేసిన మరిచర్ల వెంకటరామినాయుడు గెలుపొందారు. అక్కడి నుంచి నియోజకవర్గంలో దశాబ్దాల పాటు టీడీపీ ప్రభంజనం కొనసాగింది. 1985లో మరిచర్ల వెంకటరామినాయుడు (టీడీపీ)... పరశురాము (కాంగ్రెస్)పై పోటీ చేసి గెలుపొందారు. అనంతరం 1989లో ఎర్ర కృష్ణమూర్తి తెలుగుదేశం తరపున పోటీ చేసి... కాంగ్రెస్ అభ్యర్థి శివున్నాయుడుపై విజయం సాధించారు. 1994లో కూడా కృష్ణమూర్తి (టీడీపీ).. కాంగ్రెస్ అభ్యర్థి శివున్నాయుడుపై గెలిచారు. 1997లో కృష్ణమూర్తి మృతి చెందడంతో ఉప ఎన్నిక జరిగింది. ఆ ఉప ఎన్నికల్లో కృష్ణమూర్తి భార్య అన్నపూర్ణమ్మ పోటీ చేసి గెలుపొందారు. 1999లో టీడీపీ అభ్యర్థి డాక్టర్ ప్రతిమాదేవిపై మరిచర్ల శివున్నాయుడు(కాంగ్రెస్) గెలుపొందారు. 2004లో కాంగ్రెస్ పార్టీ నుంచి శత్రుచర్ల విజయరామరాజు.. టీడీపీ అభ్యర్థి ద్వారపురెడ్డి జగదీష్‌పై గెలిచారు. 2009లో టీడీపీ అభ్యర్థి బొబ్బిలి చిరంజీవులు(టీడీపీ)పై సవరపు జయమణి (కాంగ్రెస్) గెలుపొందారు. 2014లో టీడీపీ అభ్యర్థి బొబ్బిలి చిరంజీవులు... వైసీపీ అభ్యర్థి ప్రసన్నకుమార్‌పై విజయం సాధించారు. 2019లో టీడీపీ తరపున పోటీ చేసిన బొబ్బిలి చిరంజీవులుపై వైసీపీ అభ్యర్థి అలజంగి జోగారావు గెలుపొందారు. ప్రస్తుతం వైసీపీ నుంచి ఆయన మరోసారి పోటీ చేస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా బోనెల విజయచంద్ర బరిలో ఉన్నారు.



ఎర్ర కృష్ణమూర్తి



సవరపు జయమణి



శత్రుచర్ల విజయరామరాజు



అలజంగి జోగారావు



బొబ్బిలి చిరంజీవులు



టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు అభిమానులతో కిటకిటలాడిన పార్వతీపురం

ముగిసిన నామినేషన్ల పర్వం

- కోలాహలంగా విజయచంద్ర..

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర గురువారం భారీ ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమానికి మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముందుగా పాత బస్టాండ్ వద్ద ఉన్న సీతారామ మందిరంలో తన సతీమణితో కలసి పూజలు చేశారు. నాయకులు, కార్యకర్తలు మండుటెండను సైతం లెక్క చేయకుండా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం పార్వతీపురం పాత బస్టాండ్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి బొబ్బిలి అభ్యర్థి బేబీనాయన, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో మాట్లాడుతున్న విజయచంద్ర

ఉత్సాహంగా సంధ్యారాణి నామినేషన్

సాలూరు: సాలూరు పట్టణం పసుపు రంగు సంతరించుకుంది. తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ శ్రేణులతో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బోసుబొమ్మ కూడలి వరకు రోడ్లు కిక్కిరిసిపోయాయి. కూటమి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి స్థానిక రిటర్నింగ్ అధికారి వారి కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం మరో సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి విష్ణు చరణ్‌కు అందించారు. ఈ సందర్భంగా సాలూరు, పాచిపెంట, మక్కువ, మెంటాడ మండలాల నుంచి భారీ స్థాయిలో పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు ఆమె ఇంటి వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రచార రథంపై ర్యాలీగా ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దకు చేరుకున్నారు. బోసుబొమ్మ కూడలి వద్ద క్రేన్‌తో ఆమెకు గజమాల వేశారు. ఈ కార్యక్రమంలో కూటమి అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్పీ భంజ్‌దేవ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం 23వ వార్డు మాజీ కౌన్సిలర్ ఏగిన నాగరాజు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.



ర్యాలీలో పాల్గొన్న సంధ్యారాణి



సాలూరు పట్టణంలో కూటమి నాయకులు, కార్యకర్తల ర్యాలీ

పాపం.. పున్నారావు

రాజాం రూరల్, ఏప్రిల్ 25: విజయనగరం జిల్లా రాజాంకు చెందిన సిరిపురపు పున్నారావు చిన్నపాటి తప్పిదం వల్ల నామినేషన్ వేయలేకపోయారు. ఈ ఘటన రాజాంలో గురువారం చోటుచేసుకుంది. నామినేషన్ వేసేందుకు అవసరమైన అన్నిపత్రాలున్నా.. తాజాగా ప్రారంభించిన బ్యాంకు ఖాతాకు సంబంధించిన పాస్‌పుస్తకం లేకపోవడంతో నామినేషన్ వేయలేని పరిస్థితి పున్నారావుకు ఎదురైంది. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం చిన్న కొత్తకోటకు చెందిన సిరిపురపు పున్నారావు రాజాం నియోజకవర్గంలో ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేసేందుకు నిర్ణయించుకున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా అన్ని పత్రాలను సిద్ధం చేశారు. గురువారం మధ్యాహ్నం నామినేషన్ వేసేందుకు తన మద్దతుదారులతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి పత్రాలు అందజేశారు. పత్రాలు పరిశీలించిన ఆర్వో.. తాజాగా ప్రారంభించిన బ్యాంకు పాస్‌పుస్తకం లేకపోవడాన్ని గుర్తించారు. అప్పటికే సమయం మూడు గంటలు కావస్తుండడంతో ఏమీచేయని పరిస్థితుల్లో పున్నారావు వెనుదిరిగారు. పున్నారావు మళ్లీ నామినేషన్ వేయాలంటే మరో అయిదేళ్లు ఆగాల్సిందే.



నిరుత్సాహంగా ఉన్న పున్నారావు

అరుదైన గౌరవం

తొలి మహిళా స్పీకర్ ప్రతిభాభారతి

విజయనగరం: టీడీపీలో గుర్తింపు పొందిన నాయకుల్లో ప్రతిభా భారతి ఒకరు. మంత్రిగా, శాసనసభ తొలి మహిళా స్పీకర్‌గా అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. 1983లో ఎన్టీఆర్ పిలుపు మేరకు ప్రతిభాభారతి టీడీపీలో చేరారు. 1983, 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లో వరుసగా ఎచ్చెర్ల ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం నుంచి పోటీచేసి గెలుపొందారు. 1983 తొలి ఎన్నికల్లో ఉమ్మడి ఏపీలో తొలి ఫలితం ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచే వచ్చింది. ఆ సమయంలో ప్రతిభాభారతి అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. దీన్ని సెంటిమెంట్‌గా భావించిన ఎన్టీఆర్ ఆమెను తన మంత్రివర్గంలోకి తీసుకున్నారు. అప్పట్లో కేబినెట్‌లో ఉన్న ఏకైక మహిళా మంత్రి కూడా ప్రతిభా భారతి కావడం మరో విశేషం. ఎన్టీఆర్ కేబినెట్‌లో రెండుసార్లు ఆమెకు చోటుదక్కింది. 1995లో చంద్రబాబు తన కేబినెట్‌లోకి ప్రతిభాభారతిని తీసుకుని విద్యాశాఖను కేటాయించారు. 1999లో ఆమెకు స్పీకర్‌గా చోటుకల్పించారు. దీంతో రాష్ట్రంలోనే తొలి మహిళా స్పీకర్‌గా అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు.



అధికారులే కీలకం

- వారి పర్యవేక్షణలోనే ఎన్నికల సమరం
- గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రధాన పాత్ర

(విజయనగరం)

ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడంలో అధికారుల పాత్ర కీలకం. గ్రామ స్థాయి నుంచి మొదలుకుని జిల్లాస్థాయి వరకు అధికారులు తమ పాత్ర పోషిస్తారు. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణ, పర్యవేక్షణకు కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని, ప్రధాన ఎన్నికల అధికారి(చీఫ్ ఎలక్టోరల్ అధికారి)ని సంప్రదిస్తుంది. ఆ అధికారి పర్యవేక్షణలోనే ఎన్నికల ప్రక్రియ జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణలో జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిలో పనిచేసే అధికారుల వివరాలు..

జిల్లా ఎన్నికల అధికారి

ప్రధాన ఎన్నికల అధికారి పర్యవేక్షణలో ప్రతి జిల్లా ఎన్నికల అధికారి ఉంటారు. పాలనాధికారే (కలెక్టర్) ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నియమావళి అమలు చేయడంలో కలెక్టర్ ప్రధాన పాత్ర పోషిస్తారు. ఉన్నతాధికారుల ఆదేశాలను అమలుచేస్తారు.



సెక్టోరల్ అధికారి

ఎనిమిది నుంచి పది పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించడానికి సెక్టోరల్ అధికారిని నియమిస్తారు. ఆయా బూత్‌ల్లో ప్రశాంతమైన వాతావరణం ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటారు. అవసరమైతే పరిస్థితులకు అనుగుణంగా ఆయా చోట్ల 144 సెక్షన్ విధించే అధికారం ఆయనకే ఉంటుంది.

ఓటర్ల నమోదు అధికారి

ఓటర్ల నమోదు అధికారి(ఈఆర్వో, ఏఈఆర్వో) ప్రతి నియోజకవర్గ స్థాయిలో ఉంటారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారు, జాబితాలో పేర్లు, ఫొటోలు తప్పుగా ఉన్న వారంతా ఆయన్ను సంప్రదించాలి. ఈఆర్వో, ఏఈఆర్వో పర్యవేక్షణలో సిబ్బంది ఓటర్ల జాబితాను తయారుచేస్తారు.

ప్రిసైడింగ్ అధికారి(పీవో)

ప్రతి పోలింగ్ కేంద్రానికి ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. ఈవీ ఎంలు, వీవీ ప్యాట్‌లు బూత్‌లకు తీసుకొచ్చి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించి తిరిగి వాటిని స్ట్రాంగ్‌రూముకు చేర్చేవరకు పీవోదే బాధ్యత. వీరితో పాటు సహాయ ప్రిసైడింగ్ అధికారులు ఉంటారు. పోలింగ్‌కేంద్రాల్లో అన్ని కార్యకలాపాలు పీవో పర్యవేక్షణలోనే జరుగుతాయి.

సూక్ష్మ పరిశీలకులు

ఎన్నికలు జరిగిన తీరు, పర్యవేక్షణపై నివేదిక రూపొందించి కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక పంపించడానికి సూక్ష్మ పరిశీలకులను ఏర్పాటుచేస్తారు. మండలానికి ఒకరు మాత్రమే ఉంటారు. వీరంతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తారు.

రిటర్నింగ్ అధికారి (ఆర్వో)

ఎన్నికల నిర్వహణకు కేంద్రం రిటర్నింగ్ అధికారిని నియమిస్తుంది. ఈ అధికారి సంబంధిత నియోజకవర్గాలను పర్యవేక్షిస్తారు. నామినేషన్ ప్రక్రియ, తుది జాబితా ప్రకటన, పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించడానికి సిబ్బంది నియామకం, వారికి అవస రమైన శిక్షణ ఇవ్వడం, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి వంటి అంశాలు ఆర్వో పర్యవేక్షణలోనే జరుగుతాయి. ఆర్డీవోకు ఈ బాధ్యతలను అప్పగిస్తారు.

బూత్ లెవల్ అధికారి(బీఎల్వో)

ప్రతి కేంద్రానికి బూత్ లెవల్ అధికారి ఉంటారు. కొత్తగా ఓటరు జాబితాలో చేరే వారికి ఫారం-6, తొలగింపునకు ఫారం-7, తప్పుల సవరణకు అవసరమైన ఫారాలు ఇవ్వడం, అర్హులైన వారంతా ఓటు నమోదు చేసుకునేలా చూడడం, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు ప్రతిపాదించడం, ఓటర్ల జాబితా ప్రదర్శన, కేంద్రాల మార్పునకు బీఎల్వోలు పనిచేస్తుంటారు. వీరిలో వీఆర్ ఏలు, కారోబార్లు, అంగన్‌వాడీ టీచర్లు ఉంటారు.

పోలింగ్ ఏజెంట్లు

అభ్యర్థులు పోలింగ్ రోజున ప్రతి కేంద్రానికి వెళ్లి నేరుగా పరిశీలించలేరు. అందు వల్ల వారి తరపున ఒక ఏజెంట్‌ను నియమించుకోవచ్చు. పోలింగ్ ఏజెంట్ ఆ కేంద్రంలో ఓటరుగా ఉండాలి. పోటీలో ఎంత మంది బరిలో ఉంటే అంత మంది ఏజెంట్లను నియమించుకోవడానికి అవకాశాలు ఉన్నాయి.

తాగునీటికి కష్టాలు

● మరమ్మతులకు గురైన వండువ రక్షిత నీటి పథకం ● ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమీప గ్రామాల ప్రజలు



మరమ్మతులకు గురైన వండువలోని తాగునీటి పథకం

వీరఘట్టం: మండలంలోని వండువ తాగునీటి పథకం మరమ్మతులకు గురయ్యింది. దీంతో పరిసర గ్రామాల్లోని ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత మూడు రోజులుగా ఈ రక్షిత మంచినీటి పథకం మరమ్మతులు గురికావడంతో ప్రజలు సమీప ప్రాంతాలకు వెళ్లి నీటిని తీసుకు రావాల్సి వస్తోంది. కొన్ని గ్రామాల వారు నాగావళి నది నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. అసలే వేసవికాలం ఆపై తాగునీటి పథకం మరమ్మతులు కావడంతో గ్రామాల్లోని మహిళలు ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు.

రెండు రోజుల్లో తాగునీరు అందిస్తాం

ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ ప్రవల్లిక సంప్రదించగా ప్రధాన పైపులైన్ మరమ్మతులు గురైందని, గురువారం నుంచి మరమ్మతులు చేస్తున్నామని, రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో తాగునీరు అందిస్తామని చెప్పారు.

మలేరియా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



మలేరియా వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వీరఘట్టం: మలేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని వీరఘట్టం పీహెచ్‌సీ వైద్యాధికారి పాలవలస ఉమామహేశ్వరి సిబ్బందికి సూచించారు. గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా పీహెచ్ సీలో ఆమె సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏజెన్సీ గ్రామాల్లో ఏఎన్ఎం, ఆశ వర్కర్లు ఇంటింటికి వెళ్లి దోమతెరలు వినియోగించేలా చూడాలన్నారు. అనంతరం మలేరియా వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సీహెచ్‌వోలు పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం



మక్కువలో కురుస్తున్న వర్షం

మక్కువ: మండల కేంద్రం మక్కువలో గురువారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం వరకు భానుడు భగభగతో అల్లాడిన ప్రజలు సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. తేలికపాటి గాలులతో విద్యుత్ సరఫరాకు కొంత అంతరాయం ఏర్పడింది.

ఘనంగా గుర్రప్ప ఉత్సవాలు



గుర్రప్ప ఉత్సవాల్లో పాల్గొన్న బోటు వారి కుటుంబ సభ్యులు

పార్వతీపురంటౌన్: పట్టణంలోని రెడ్డి వీధిలోగల బోటువారి కుటుంబీకుల కులదైవం గురునాథం(గుర్రప్ప) ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. గురునాథం మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేసి, పట్టణ పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం కొత్తవలస నవదుర్గా ఆలయం వద్దగల కోనేరులో శుద్ధిచేసి, ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు చేశారు. మళ్లీ బోటువారి నివాసానికి తీసుకువచ్చారు. 64 ఏళ్ల తర్వాత ఉత్సవాలు నిర్వహించడంతో బోటువారి కుటుంబ సభ్యులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు.

సత్యనారాయణ స్వామి ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠ



సామూహిక వ్రతాలు చేస్తున్న మహిళలు

భామిని: బాలేరు గ్రామంలోని శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో ధ్వజస్తంభం, గరుడ వాహనం పునఃప్రతిష్ఠ గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పురవీధుల్లో ఆట, పాటలతో భక్తులను ఆలయానికి ఆహ్వానించారు. వేద పండితులు ఆధ్వర్యంలో సామూహిక వ్రతాలు చేపట్టారు. గరుడ వాహనం, ధ్వజస్తంభం, విద్యానసాయి మండపంలను పునఃనిర్మాణానికి ప్రతిష్ఠ చేపట్టారు. భారీ స్థాయిలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా పుష్పయాగం



కోదండరామస్వామి ఆలయంలో పుష్పయాగం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొండ: పట్టణంలోని ముదునూరువారి వీధిలో ఉన్న శ్రీకోదండ రామస్వామి దేవస్థానంలో గురువారం పుష్పయాగం గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం 9 గంటల నుంచి వివిధ రకాల పుష్పాలతో ఆలయ అర్చకులు పుష్పయాగ కార్య క్రమం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. పుష్పయాగం కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సైకో పాలనకు స్వస్తి పలకాలి: జగదీశ్వరి



కురుపాం: ప్రచారంలో పాల్గొన్న కూటమి అభ్యర్థి జగదీశ్వరి

గరుగుబిల్లి: రాష్ట్రంలోని సైకో పాలనకు స్వస్తి పలకాలని కూటమి కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి పిలుపునిచ్చారు. ఉల్లిభద్ర సమీపంలోగల ఎర్రన్నగుడి ప్రాంతంలో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు అంబటి తవిటినాయుడు, ముదిలిబాబు విజయవాంకుశం, యామల శ్రీనివాసరావు, ఆర్.గోవిందరావుతో పాటు పలు గ్రామాల ప్రతినిధులు పాల్గొన్నారు. ● **కురుపాం:** కురుపాంలో కూటమి అభ్యర్థి తోయక జగదీశ్వరి ప్రచారానికి అపూర్వ ఆదరణ లభించింది. గురువారం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ ఆధ్వర్యంలో ఆమె కురుపాం పంచాయతీలోని పూతికవలస, సీతంపేట, పాత కురుపాం, శివ్వన్నపేట గ్రామాల్లో ప్రచారం చేశారు. ఆమెకు గ్రామస్థులు హారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు కద్రక మల్లేష్, తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, టీడీపీ మండల కన్వీనర్ కేవీ కొండయ్య, బీజేపీ నాయకుడు ఎన్.దూళికేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామల్లో కూటమి నాయకుల ప్రచారం

గుమ్మలక్ష్మీపురం: కురుపాం నియోజకవర్గంలో బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ గవాన ఉమామహేశ్వరి, పార్టీ నియోజకవర్గ విస్తారక్ బండి సత్యనారాయణ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థి ప్రచారంలో భాగంగా బీజేపీ మండల కన్వీనర్ పెద్దింటి దివాకర్, టీడీపీ నాయకురాలు బిడ్డిక పద్మావతి, మాజీ ఎంపీటీసీ జంధ్యాల సునీత, సీనియర్ నాయకురాలు రాగాల అప్పలకొండ.. గుమ్మలక్కగూడ, ఇరిడి, దుమ్మంగి, పెద్దకర్జ, నోంద్రుకోన గ్రామాల్లో ప్రచారం చేశారు. ● **గరుగుబిల్లి:** టీడీపీ అరకు పార్లమెంటు బీసీ సెల్ అధ్యక్షుడు బూరాడ రామ్‌మోహనరావు గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

సీతంపేటలో జయకృష్ణ ప్రచారం



సీతంపేట: పెద్దపొల్లలో జయకృష్ణకు స్వాగతం పలుకుతున్న మహిళలు

సీతంపేట: మండలంలోని పెద్దపొల్లి, చిన్నపొల్ల, నాయకమ్మగూడ గ్రామాల్లో కూటమి పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ గురువారం ప్రచారం నిర్వహించారు. పలుచోట్ల అయనకు మహిళలు హారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో మజీ తోటపల్లి ప్రాజెక్టు ఛైర్మన్ నిమ్మక పాండురంగ, టీడీపీ మండల అధ్యక్షుడు సవరతోట ముఖలింగం, మాజీ ఎంపీటీసీ మండంగి ప్రకాష్, సర్పంచ్ బిడ్డిక అప్పారావు, మహాశక్తి ప్రచారకర్త తోయక సంధ్యారాణి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్‌కు తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు

మక్కువ: కూటమి సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి గురువారం సాలూరులో నామినేషన్ వేసిన సందర్భంగా టీడీపీ మండల శ్రేణులు సుమారు రెండు వేల మంది వంది ఆటోలతో తరలివెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు. ● **సాలూరు రూరల్:** సాలూరులో కూటమి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి గురువారం నిర్వహించిన నామినేషన్ ర్యాలీకి భారీ సంఖ్యలో సాలూరు, పాచిపెంట, మక్కువ, మెంటాడ మండలాల నుంచి జనం తరలివచ్చారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గుర్ల: మండలంలో శుక్రవారం గరివిడి నుంచి నాలుగో సబ్‌స్టేషన్‌కు వెళ్లే హెచ్‌టీ లైన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖాధికారి హరి తెలిపారు. నాగళ్లవలస సబ్‌స్టేషన్ పరిధిలోని జమ్ము, జమ్ముపేట, నాగళ్లవలస, తాటిపూడి, సదానంతపురం, గొలగాం, తదితర గ్రామాలకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

ఎన్నికలు సజావుగా సాగేందుకు సహకరించండి

● గ్రామాల్లో పోలీసుల అవగాహన కార్యక్రమాలు



జియ్యమ్మవలస: కుదమ గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ మంగరాజు



పాలకొండ: వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

జియ్యమ్మవలస: సార్వత్రిక ఎన్నికలు సజావుగా సాగేందుకు ఎలాంటి తగాదాలు, వివాదాలు చోటుచేసుకోకుండా ప్రజలు సహకరించాలని చినమేరంగి సీఐ బి.మంగరాజు కోరారు. కుదమ పంచాయతీలో గురువారం ఆయన అవగాహన కల్పించారు. ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. గతంలో ఇదే గ్రామంలో వివాదాలతో అనేకమంది పోలీస్‌స్టేషన్, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని, ఇలాంటి పరిస్థితి తిరిగి రాకుండా ప్రజలంతా పోలీసులకు సహకరించాలని అన్నారు. ఎస్ఐ చిన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వాహన పత్రాలు తప్పనిసరి

పాలకొండ: వాహనదారులు వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉంచుకోవాలని సీఐ చంద్రశేఖర్ సూచించారు. ఎన్నికల నేపథ్యంలో పాలకొండ-రాజాం రోడ్డులోని గొట్టమంగళాపురంలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టుల వద్ద గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. నగదు, బంగారం, ఇతర వస్తువులు తీసుకెళితే దానికి సంబంధిచిన పత్రాలు పక్కాగా ఉండాలన్నారు. రూ.50వేలకు మించి నగదు ఉంటే సీజ్ చేస్తామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రతిఒక్కరూ పాటించాలన్నారు.

జీసీసీ లక్ష్యం రూ.60కోట్లు



ఎంఎల్ఎస్ పాయింట్ పరిశీలిస్తున్న జీసీసీ డివిజనల్ మేనేజర్

సాలూరు రూరల్: జీసీసీ ఈ ఆర్థిక సంవత్సరం(2024-25)లో వ్యాపార లక్ష్యం రూ.60 కోట్లుగా నిర్ణయించామని జీసీసీ డివిజనల్ మేనేజర్ ఉరిటి మహేంద్రకుమార్ తెలిపారు. ఆయన సాలూరు జీసీసీ కార్యాలయంలో సాలూరు, పాచిపెంట, మక్కువ, రామభద్రపురం, మెంటాడ మండలాల సేల్స్‌మెన్లు, సిబ్బందితో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరంలో జీసీసీ పార్వతీపురం మన్యం జిల్లాలో దాదాపు రూ.60 కోట్లు వ్యాపార లక్ష్యాన్ని చేరుకుందన్నారు. ఈ ఏడాది రూ.60 కోట్లు లక్ష్యంగా నిర్ణయించినా అంతకు మించి సాధించడానికి సిబ్బంది కృతనిశ్చయంతో పనిచేయాలన్నారు. జీసీసీ సిబ్బంది ఎటువంటి అవకతవకలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవన్నారు. సాలూరులో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా గోడౌన్ ఇన్‌చార్జి సీహెచ్ రాములను వివరాలడిగి తెలుసుకున్నారు. మండలాల మ్యాపింగ్ మారడం వల్ల సాలూరు నుంచే పాచిపెంట, మక్కువలకు సరుకులు పంపించడంలో సమస్య ఏర్పడుతుందని రాములు వివరించారు. ఈ సమస్యను డీఎస్వో దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. ఈనెల 30 నాటికి సరుకులు డిపోలకు చేరేటట్టు శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ఆయనతో జీసీసీ సాలూరు మేనేజర్ జె.రామారావు తదితరులున్నారు.

క్లుప్తంగా..

అధిష్ఠానం ఆదేశాలు పాటిస్తా: భూదేవి

పాలకొండ: టీడీపీ అధిష్ఠానం ఆదేశాలు తప్పకుండా పాటిస్తానని పార్టీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా నూతనంగా నియమితులైన భూదేవి గురువారం పాలకొండలోని కోటదుర్గమ్మను దర్శించుకున్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఆమె తోపాటు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పూడి తిరుపతిరావు, జనసేన ఉపాధ్యక్షుడు గర్భాన సత్తిబాబుతో కలిసి పట్టణంలోని జనసేన కార్యాలయం నుంచి ప్రచారానికి బయలు దేరారు. ఆమె వెంట పలువురు కూటమి నాయకులు ఉన్నారు.

నేడు పృథ్వీరాజ్ ప్రచారం

పాలకొండ: జనసేన నాయకుడు, సినీ నటుడు పృథ్వీరాజ్ పాలకొండలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. కోటదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని సాయంత్రం ఐదు గంటల నుంచి మార్కెట్, పోస్టాఫీస్ రోడ్డులో కూటమి జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణకు మద్దతుగా ప్రచారం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొనున్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చూపిన దుర్గా భాగ్యశ్రీ

పాలకొండ: జేఈఈ మెయిన్స్‌లో పాలకొండకు చెందిన శివ్వాల దుర్గా భాగ్యశ్రీ ప్రతిభ చూపింది. ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో 7,398 ర్యాంకు, ఆల్ ఇండియా ఓబీసీలో 1,588 ర్యాంకు సాధించింది. ఆమె విశాఖలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతుంది.

సీపీఎం ప్రచారం

కొమరాడ: చోళ్లపదం పంచాయతీ రెబ్బ, వనధార, తదితర గిరిజన గ్రామాల్లో సీపీఎం నాయకుడు కొల్లి సాంబమూర్తి గురువారం ప్రచారం చేశారు. సీపీఎం కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి రమణను గెలిపించాలని ఆయన కోరారు. ఆయన వెంట పలువురు సీపీఎం నాయ కులు ఉన్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలతో పాటు జైగురుదత్త హోమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా బిత్రమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



పూజలందుకుంటున్న అమ్మవారు

బొండపల్లి: నెలివాడ గ్రామంలోగల బిత్రమ్మతల్లి ఆలయ 8వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహిం చారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

రాయగడ: విశాఖ-దుర్గ్ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి జారిపడి పద్మ మార్కండ(35) అనే యువకుడు మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి గవర్నమెంటు రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ నుంచి దుర్గ్ వెళ్తున్న రైలులో ప్రయాణిస్తున్న పద్మ మార్కండ.. లడ్డ స్టేషన్ వద్ద రైలు నుంచి జారిపడింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని క్షతగాత్రుడికి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను మృతిచెందినట్టు ధృవీకరించారు. మృతుని వద్దనున్న ఆధార్ కార్డు ఆధారంగా పోలీసులు కుటుంబీకులకు విషయం తెలియజేశారు. కుటుంబీకులు వచ్చిన తర్వాత పోస్టుమార్టం జరిపించి బంధువులకు అప్పగించారు. పద్మ మార్కండ ఉపాధి కోసం ఛత్తీస్‌ఘడ్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో ఈ ఘటనకు గురైనట్లు జీఆర్పీ ఎస్ఐ మకర్ సాహు తెలిపారు.

ఒడిశా

అనాథ పిల్లలకు ఆసరా



శిశు సంరక్షణ కేంద్రంలో ఉన్న చిన్నారులు

రాయగడ: తలిదండ్రులను కోల్పోయి ఏ ఆసరా లేని ఇద్దరు అనాథ పిల్లలకు జిల్లా యంత్రాంగం ఆసరా కల్పించింది. గుడారి సమితి ఖరీరుడ పంచాయతీకి చెందిన ఇద్దరు అనాథలు తలిదండ్రులను కోల్పోయి తాతగారింటిలో జీవిస్తున్నారు. ఇటీవల తాత కూడా అకస్మాత్తుగా మరణించారు. ముసలిఅమ్మమ్మ వారిని సాకలేక నానా అవస్థలు పడుతోంది. ఈ విషయం తెలుసుకున్న యంత్రాంగం పిల్లలను జిల్లా శిశు సంరక్షణ కేంద్రానికి అప్పగించారు. జిల్లా యంత్రాంగం తరపున జిల్లా శిశు సంరక్షణ అధికారులు, శిశు సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

భక్తులకు పుచ్చకాయల పంపిణీ

రాయగడ: స్థానిక మజ్జిగౌరి అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు గురువారం అంతర్జాతీయ మహిళా హక్కుల కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షురాలు సంతోషి సేనాపతి అధ్యక్షతన పుచ్చకాయలు పంపిణీ చేశారు. జిల్లా అధ్యక్షురాలు ఎస్.సుజాత, ఉపాధ్యక్షులు కె.సుమన్, రాజా పాల్గొన్నారు.

పట్టాలు తప్పిన గూడ్స్



పాడువా వద్ద పట్టాలు తప్పిన గూడ్స్

సాలూరు రూరల్: ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లా పాడువా వద్ద కిరండోల్ నుంచి విశాఖకు వెళ్తున్న గూడ్స్ రైలు గురువారం పట్టాలు తప్పింది. విశాఖ పోర్టుకు ఇనుప ఖనిజం తీసుకెళ్తున్న ఈ గూడ్స్ పాడువా వద్దకు రాగానే పట్టాలు తప్పింది. ఆరు బోగిలు పట్టాలు తప్పడంతో ఇనుప ఖనిజం, బోగిలు పట్టాలపై పడ్డాయి. దీంతో ఈ మార్గంలో విశాఖ నుంచి కొత్తవలస మీదుగా నడిచే రైళ్లను నిలిపివేశారు. ఎంఆర్ ట్రైన్‌లో సిబ్బంది అక్కడికి చేరుకునియుద్ధప్రాతిపదిన పనులు చేపట్టారు.

శ్రమదానంతో రహదారిపై గోతులు పూడ్చివేత

గరుగుబిల్లి: పార్వతీపురం, శ్రీకాకుళం ప్రధాన రహదారి పరిధిలోని ఖడ్గవలస జంక్షన్‌లో ఏర్పడిన గోతులను అదే గ్రామానికి చెందిన దాసరి సింహాచలం గురువారం మట్టితో పూడ్చివేశారు. ఖడ్గవలస జంక్షన్‌లోని రహదారిపై పలు చోట్ల గోతులమయంగా తయారవ్వడంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో సింహాచలం శ్రమదానంతో గోతులను పూడ్చి వేశారు. ఈసందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

ఏ అభ్యర్థికి టికెట్ ఇచ్చినా పని చేస్తాం

సాలూరు: ఇండియా కూటమికి సంబంధించి ఎమ్మెల్యే అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ఎవరికి టికెట్ కేటాయించినా కష్టపడి పనిచేసేందుకు తామంతా సిద్ధంగా ఉన్నట్లు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సిగడాపు బంగారయ్య తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియా కూటమి పొత్తుల్లో భాగంగా అరకు పార్లమెంట్ అభ్యర్థిగా వామపక్షాలకు చెందిన పాచిపెంట అప్పలనరసకు కేటాయించగా, సాలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి కాంగ్రెస్ పార్టీ అదిష్ఠానం ఎవరిని అభ్యర్థిగా ప్రకటించినా పనిచేసేందుకు తామంతా సిద్ధంగా ఉన్నట్టు ఆయన తెలిపారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.